# దర్గామిట్ట కతలు

# మేమందరం లేట్ లతీఫ్‌లమే!




చీకటితో నిద్ర లేచే పనికంటే ఇంకో నామర్దా పని మా ఇంట్లో మేమెరగం.

ఆ మాటకొస్తే తెల్లగా తెల్లారిపోయినాకనే దుప్పట్లో ముడుక్కొంటా మద్యమద్యలో మేలుకుంటా ఒకరినొకరం కరచుకొని పొణుకోనడంలో వుండే మజా మేమెరిగినంతగా యింకెవురూ ఎరిగుండరు.

ఒకాల, ఎవ్వడన్నా యిస్కూళ్లకనిజెప్పి మా అమ్మ మమ్మల్ని తొందరగా నిద్రలేపబోతే దేవుడిలాంటి మా నాయిన తన అలివిగాని దయతోటి 'యింత పొద్దున్నే లేచి నా బిడ్డలు రాజ్జాలేలాలంటమ్మే' అంటా మా తమ్ముణ్ణి గెట్టిగా గుండెలకదుముకునే వోడేగానీ మాక్కై మేము లేచేంత వరకూ నిద్రలేవనిచ్చేవాడు గాదు.

అట్టా అలిశ్యంగా నిద్రలేవడమనే ఆస్తిని మా నాయిన వదిలంగా దాచిపెట్టి మాకు దారాదత్తం చేస్తా వుంటే మాఅన్నతో వాతోబాటు 'నేనేనా తక్కువదాన్ని' అంటా మా చెల్లెలు కూడా బాగాని కొచ్చింది. నిజ్జంగానే నిద్రబోవడంలో మేము శేరైతే అది సవాశేరు.

'యీ అమ్మి యీ వొయసులోనే యిట్టా నిద్రపోయి సస్తా ఉందే రేపు పెద్దయినాక అత్త తో ఖాయంగా చాకిరీ చేయిస్తుందిది' అంటా మానాయినమ్మ మా చెల్లెలి నిద్రని యిచిత్రపోయి చూస్తా ఉండేది.

ఆమెకు తోడు మా అమ్మ కూడా రొంత పెందలకాణ్ణే లేచిన పుణ్యానికి 'ఊరంతా మేలుకునేసినా ఈ అబ్బా బిడ్డలకు మెలుకవ రాదేమిటమ్మో' అంటా మా చెవులకాడ చేరి డైలాగులు మాకతా ఉండేది. అయినా సరే– మా నిద్ర చెదిరేదికాదు!

లేటు నిద్రవల్ల మాకు చిల్లరమల్లర నష్టాలొచ్చినాయిగానీ అయి పెద్దగా లెక్కలోకి తీసుకునేయిగావు.

అయినా మాటవరసకు రొన్ని చెబుతా. మా నాయిన తెల్లారిపూట పనంటే చాలు కోటి రూపాయలు దెచ్చి కాళ్లముందర కుమ్మరించినా సరే కదిలే వాడు కాదు. అదే రేత్రిపూట పనైతే... ఒంటి గెంటా... రొండైనా సరే...సిగిరెట్లు టీలు తాగతా కళ్ళు డబ్బిల్లాగా తెరుచుకొని కూచునేసేవాడు. శ్లాబులో పైపులు పెట్టాలనో బావిలో నీళ్ళమోటారు బిగించాలనో ఏ రెడ్డన్నా పొద్దున్నే మా నాయిన ఎంబడిపడి 'బాబ్బాబు...నాయిన్నా యినా' అని బతిమిలాడితే– నిద్రకళ్లతో లేచి, జబ్బలు గీరుకుంటా 'నీకెందుకు మవు పా భాయ్. అయిదే అయిదు నిమిషాల్లో ఆడుంటా' అని జూటా భరోసా యిచ్చేవాడే గానీ యింట్లోకొచ్చాక పదిగెంటలైనా ముసుగు తీసేవాడు కాదు. దాంతో కొన్ని పనులు పక్కోళ్ల పాలకుబోయేవి.

యింక మనకొచ్చిన సుకమైన నష్టమేమిరా అంటే పొద్దున పూట పర్‌వేట్(ప్రయివేట్) శాశ్వితంగా నంగనామం కావడం!ఏ టుటోరియల్స్‌లో అయినా సరే పొద్దున పూట రానసే షరతుపెట్టి మరీ చేరతాను కాబట్టి పాయింత్రాలు పోకపోతేనే మా యింట్లో నాకు పనిష్మెంటు. పొద్దున పోకపోతేలా. (ఈ అలవాటును షేకు చిన సవాబు లెవిల్లో చదువుకున్నంత కాలం కొనసాగించినాను. మా జవహర్‌బారతి కాలేజీ పొద్దున ఏడున్నరకు మొదలయినా యీ అలవాటు వల్ల ఏనాడూ ఫస్టు పిరీడుకు పోయిన పాపమెరగలా. కానీ ఒక్కసారి తిన్నాను జలదంకి కండె. నేను సీనియర్ ఇంటర్ ఎంపిసిలో ఉండగా నా మీద పగఖట్టినట్టు మా ప్రసాదయినోరు పొద్దున ఆరింటికి పెట్టాడు లెక్కల ట్యూషను.యింక చూసుకోండి. నా బాధ బాధకాదు. మరీ అంత పొద్దున్నే లేవడం కష్టమయ్యి యివ్వడొక పారి అప్పుడొకపారి పోయి ఆ తర్వాత మొత్తంగా ఎగనామం పెట్టేసినాను. పలితం చెప్పాల్నా? చావుదప్పి కన్నులొట్టబోయినట్టు– ఫెయిలుకాకుండా సరిగ్గా ప్యాసు మార్కులతో బతికి బయటపడగలిగింది కేసు.ఆ మార్కులలిస్టు నా లేటునిద్రకి బలే తీపిగుర్తు)

సరే అయన్నీ అట్టపోనీండిగానీ మా యింట్లో నిద్రలేచిన ఎమ్మట్నే వేడి వేడిగా టీ బెట్టుకునే తీరు చెబుతా.

పావుకేజీ పాకెట్లు, వందగ్రాముల పాకెట్లుండే టీ ఆకును మా నాయిన ఏనాడూ తన చేతులో తాను తేలేదు గాబట్టి మా యింట్లో టీ బెట్టాలంటే త్యాపత్యాపకీ బిస్మిల్లాయే!

మా అమ్మోళ్లి పాతశెట్టి కాణ్ణుంచి దారానికి ఏలాడుతున్న సూపర్‌డస్టు పాకెట్లు పది పైసలవి అయిదుగానీ, పావలావి రొండుగానీ తెచ్చినాకనే మాకు టీ. యిక పావలా పాకెట్టులే నాలుగు తెచ్చిందంటే ఆ పూట స్ట్రాంగు టీ .తాగబోతున్నట్టు లెక్క.

(యీ పాకెట్ల మీదుండే పావల బిళ్ల, పైది పైసల బిళ్లలను చింపుకొని గోలీలాటప్పుడు డబ్బులతో సమానంగా వాడుకునేవాళ్లం)

ఈ టీ పాకెట్లు తెచ్చినాక, ఎక్కువ నీళ్ళూ తక్కువ పాలూ పోసి, టీయాకు ఎర్రగా మరగనిచ్చి, అంత చక్కెర బోసి కలిబెట్టేంత వరకూ అందరం కాచుకోని వుంటాం. ఎప్పుడైతే చెంబులోకి మా అమ్మ టీని వడగడుతుందో అప్పుడిక ఎటాకే!పొర్రు ష్మార్రుమని పొదువుకుంటా ఉఫ్ఫు ఉఫ్ఫుమని పూదుకుంటా పాచివళ్లతో జొళ్లు మొకాలతో తాగతా ఉంటే ఉంటుందిరా నాయినా... తాగితే తప్ప తెలియని రుచి. (కానీ పళ్లుతోముకున్నాక టీ తాగే వాళ్లందరూ యీ రుచిని మిస్సయిపోయినట్టేనబ్బా)

ఒకోరోజు పాలు మేము లేటుగా లేవడం వల్ల సంకనాకిపోతాయి గదా... అప్పుడు కూడా మా టీనీళ్లకొచ్చిన డోకా ఏమీలా. రూపాయి బిళ్లొకటి చేతిలో బెట్టి,. యిస్టీలు చెంబు కడిగిచ్చి 'రే అబయా...క్రిష్ణా ఓటలుకు పోయి అయిదు స్ట్రాంగ్ టీలు పోయించుకొని రాబో' అంటుంది మా అమ్మ.

క్రిష్ణా ఓటల్లోని అరంవోడు టీ బోసినాక, చెంబు మీద జాగ్రత్తగా యిస్తరాకు కప్పుకొని ఎంత వేగంగా నడిచే వాణ్ణంటే ఇంటికొచ్చే సరికి టీ వేడి యినుమంత కూడా తగ్గేది కాదు.(అయితే ఓటలు టీ

తెచ్చినప్పుడల్లా సమాన బాగాల కోసం మా యింట్లో గొడవలు జరగతా వుండేవి. గిలాసు పట్టుకొని 'యింకొంచింమా యింకొంచెం'అని ఎంబడిబడితే చెంబు వొంచినట్టుగా వొంచి టీ పోసినట్టుగా యాక్షను చేసేది మా అమ్మ)

యిట్టా టీనీళ్లకు కొట్టుకుంటా పగలు తప్పితే వేకువ. చూడకుండా బతకతా వుండినా మేము చీకటితో నిద్రలేచేసిన రోజొకటుంది.

ఆరోజు ఆఖరీ చహార్షుంబ!(అంటే ఆఖరి బుద వారం అని అర్దం. మా కేలండరు ప్రకారం వొచ్చే ఆ బుదవారం రోజున మావాళ్లు చీకటితో సముద్ర స్నానాలు చేస్తారు)

ఆ రోజు నాయినా... జీవితంలో తొలిసారి నేను తెల్లారి నాలుగ్గెంటలప్పుడు లోకం ఎట్టా ఉంటుందో చూసినాను.

మా షమ్మీ వాళ్ల నాయిన అహ్మద్ బాషా లారీదెస్తే, దానికి టార్పల్‌పట్టా కట్టి మా యీది వాళ్లమంతా కూచొని తుమ్మలపెంట సముద్రానికి పోతావుంటే... ఆ చల్లటి గాలినీ, బూడిద రంగులో ఆకాశాన్నీ, అప్పటికే మేలుకువేసిన పిచికల్నీ, ఖాళీ యీదుల్నీ ప్రతీదాన్ని యిచిత్రపోయి చూడటమే.

సముద్రం కాడికి పోయినాక ఎంటనే స్నానాలకు దిగకుండా మేమందరం ఇసికలో కూలబడ్డాం – నిద్రలేవబోతున్న సూరీణ్ణి చూద్దానికి.

కాసేపటి తర్వాత మా చూపులు మెరిసినాయి.

సముద్రానికి ఆ పక్క– నీళ్ల మీద తేలినట్టుగా– మిఠాయి రంగులో సూరీడు!

మాకు పట్టపగ్గాల్లేవు.

'హాయ్! సూరీడ్' అంటా అందరం కేరింతలు కొడ్తా సూరీడికి చేతులూపేసినాం. మాతోపాటు పెద్దోళ్లు కూడా తొలిసారి చూస్తా వున్నట్టు కళ్లు యింతింత చేసుకోని చూశారు సూరీణ్ణి.

మా అమ్మ మా తమ్ముణ్ణి వొళ్లో కూచోబెట్టుకొని వాడి చేత కూడా చేతులూపిస్తా వుంది. అప్పుడు మా అమ్మ పక్కన కూచున్న మా నాయిన కూచున్నోడు కూచున్నట్టు వుండకుండా 'ఏమైనా పొద్దున్నే నిద్రమేలుకుంటే బాగానే ఉండేట్టుంది మే' అన్నాడు ఆవలిస్తా!

మా అమ్మ చేతులూపడం' ఆపి మా నాయిన తట్టు చురచురా చూసింది.

పనిలో పడితే ఇంటినీ, ఇంటికొస్తే పనినీ, నిద్ర పోయినాడంటే అసలకీ లోకాన్నే మర్చిపోయే మా నాయిన్ని– యాడ 'ఏమి జరిగినా మనకెందుకులే అనుకొని రెక్కలు ముక్కలు కొట్టుకుంటా తన మానాన తాను బతికే బంగారంలాంటి మా నాయిన్ని మా అమ్మ చురచురానే చూస్తా 'పొద్దున్నే మేలుకోబళ్లేదు నాయినా. అసలికి మేలు కుంటే చాలు' అంది. అన్నాక సూరీడు వైపు తల తిప్పుకునింది.

–మహమ్మద్ ఖదీర్‌బాబు

# హుస్సేన్ సాగర తీరాన...

కంపించే చాందినీ ఛాయలో
ఒకానొక అర్ధరాత్రి
నేను ఏకాంతంలో చింతా ద్వీపవాసినయినపుడు
నీ "ఖోయా ఖోయా" పాట గమ్మత్తు
తుళ్ళిపడే అగర్ వత్తుల ధూపంలా
నన్ను చుట్టుముడుతుంది.

స్నేహాల బొమ్మజెముళ్ళలో
ప్రేమరాహిత్యమే పతాకమై
నా కలల మొగులంతా ఆవరిస్తున్నప్పుడు
పరనింద లేని లౌక్య ప్రకటనలో
నటశేఖరుల విదూషకత్వం
నన్ను విసిగిస్తున్నప్పుడు
నువ్వు గుర్తొస్తావ్!
కనుమరుగవుతున్న నీ సాహచర్యం వాడన
నేను తచ్చాడుతున్నాను.
మన దోస్తానా
నన్ను ప్రవహించే అలను చేసి
నిలుచున్న చోట నిలువనివ్వదు.

మిత్రమా
ఓ నల్లటి సాయంత్రాన
నీ స్మృతి శకలం రాగరంజితమై చిప్పిల్లుతుంది
నీ మంచితనం వసంతమై
నా చుట్టూ పరివ్యాప్తమౌతుంది
విరిగిపోతున్న మన స్నేహ వారధిపై
నీ చిరునవ్వే మంత్రించిన మాటవుతుంది.
హుస్సేన్ సాగర తీరాన
గతించిన రాత్రుల్నీ, సాయంత్రాల్నీ
వేళకాని వేళన తట్టినపుడు
మనం కలబోసుకున్న
చిరు చిరు కలల చిరునామాలు
విజయ వైఫల్యాల విధివంచితాలు
గుప్పుమంటాయి.
పచ్చ పచ్చగా పరుచుకున్న ఆ పచ్చ గడ్డిలో
ఇంకా చెదిరిపోని నీ పాదాల నిఖితపై
ఆ వెన్నెల చెరువు సైతం
ఓ కన్నీటి చుక్క రాల్చుతుంది
వంగిన కొమ్మొకటి
వినమ్రంగా తల దింపుకుంటుంది.

–ఎస్. జగన్

